AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

4-10-2025 (Saturday) MAIN EDITION

## ట్రంప్‌పై మోదీ ప్రశంసలు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. గాజాలో శాంతి స్థాపనకు ట్రంప్ ఇటీవల ప్రయత్నాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ మేరకు 20 పాయింట్ల ప్రణాళికను ముందుకు తీసుకొచ్చారు. దీనికి ఇజ్రాయెల్ అంగీకారం తెలిపింది. ఈ ప్రణాళిక మేరకు బందీలను విడుదల చేసేందుకు హమాస్ సైతం ముందుకు వచ్చింది. దీంతో ట్రంప్ చర్యలను సమర్థిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. గాజాలో శాంతి స్థాపనకు పురోగతి సాధించారంటూ ట్రంప్‌ను అభినందించారు.

## అమెరికాలో కాల్పులు.. హైదరాబాద్ విద్యార్థి మృతి



**అక్షరటుడే, హైదరాబాద్:** అమెరికాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన విద్యార్థి మృతి చెందాడు. ఎల్బీనగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. తెల్లవారుజామున డాలస్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో చంద్రశేఖర్ మృతి చెందాడు. బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మావోలతో చర్చల ప్రసక్తే లేదు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. శనివారం ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పర్యటించారు. మావోలు ఆయుధాలను వదిలి లొంగిపోవాలని సూచించారు. నక్సల్స్‌తో చర్చలు జరపడానికి కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సిద్ధంగా లేవని షా తేల్చి చెప్పారు.

## హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గల లోతుకుంట వద్ద శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న సైకిల్ దుకాణంలో మంటలు చెలరేగాయి. అనంతరం మంటలు పక్కనే ఉన్న దుకాణాలకు వ్యాపించాయి. అగ్ని మాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పి వేశారు.

## ఓటీటీలోకి 'మిరాయ్'..




**అక్షరటుడే, సినిమా డెస్క్:** తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఫాంటసీ అడ్వెంచర్ 'మిరాయ్'. ఇటీవల విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. కాగా.. ఈ సినిమా తాజాగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా అక్టోబర్ 10 నుంచి స్ట్రీమింగ్ కానుంది.

## ఈ–కామర్స్ సంస్థలపై కేంద్రం ఆగ్రహం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్‌కు బాగా అలవాటు పడ్డారు. దీంతో వాటికి గిరాకీ పెరిగింది. ప్రజలు ఈ-కామర్స్ సైట్ల ద్వారా వస్తువులు కొనుగోలు చేస్తుండడం పెరిగింది. దీంతో ఆయా సంస్థలు వినియోగదారులపై అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ఇటీవల ప్లాట్ ఫామ్ ఫీజులు వసూలు చేస్తున్నాయి. అంతేగాకుండా క్యాష్ ఆన్ డెలివరీలకు సైతం అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి సంస్థలపై దర్యాప్తు ప్రారంభించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తెలిపారు. అలాంటి ప్లాట్‌ఫామ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఆటోడ్రైవర్లకు రూ.15 వేలు.. పథకం ప్రారంభించిన ఏపీ



**అక్షరటుడే, అమరావతి :** ఆటో డ్రైవర్ల సేవా పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రతియేటా రూ.15 వేల ఆర్థిక సాయం అందించనుంది. విజయవాడ బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తొలి విడతగా 2.90 లక్షల మందికి డబ్బు జమ చేశారు. ఈ పథకం కింద మొత్తం 2,90,669 మంది డ్రైవర్ల ఖాతాల్లో రూ.436 కోట్లు జమ చేశారు. వీరిలో ఆటో డ్రైవర్లు 2.64 లక్షల మంది, ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 20,072, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు 6,400 మంది ఉన్నారు.

## క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరైన ఎమ్మెల్యేలు

**అక్షరటుడే, హైదరాబాద్:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో విచారణ జరుగుతోంది. క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఇద్దరు ఎమ్మెల్యేలను పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఎగ్జామినేషన్ చేశారు. అక్టోబర్ 1న అసెంబ్లీలో స్పీకర్ సమక్షంలో విచారించగా అయితే సమయం సరిపోకపోవడంతో.. నేడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డిలను విచారించారు.

# యువోత్సాహం



**పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. అయితే ఈసారి పల్లె రాజకీయ ముఖచిత్రం బాగా మారిపోయింది. ఎన్నికల్లో పోటీకి యువతరం తహతహలాడుతోంది. సర్పంచ్ పదవిపై పెద్ద సంఖ్యలో యువ నేతలు కన్నేశారు. రాజకీయ భవిష్యత్తుకు తొలి అడుగుగా భావించే సర్పంచ్ పీఠాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. రిజర్వేషన్లు కూడా కలిసి రావడంతో చాలా మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని యత్నిస్తు న్నారు. సర్పంచ్‌గా గెలవాలంటే గ్రామంలో పట్టు పెంచుకోవాలన్న భావనతో ఇప్పటికే చాలా మంది సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.**

\- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- స్థానిక పోరుకు సై అంటున్న యువత
- పోటీ చేసేందుకు సన్నాహాలు
- సర్పంచ్ పీఠంపై కన్నేసిన యువనేతలు
- గ్రామాల్లో పట్టుకోసం ప్రయత్నాలు
- ఇప్పటికే సేవా కార్యక్రమాలతో జనంలోకి..
- కలిసొచ్చిన రిజర్వేషన్లు..

స్థానిక సంస్థల సమరానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవలే షెడ్యూల్ విడుదల చేసింది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు తొలి రెండు దశల్లో.. ఆ తర్వాత సర్పంచ్, వార్డు మెంబర్లకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనుంది. ఈ మేరకు అక్టోబర్ 9న నోటిఫికేషన్ జారీ కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 5,749 ఎంపీటీసీలు, 565 జెడ్పీటీసీలకు సంబంధించి అక్టోబర్ 23, 27న రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే, మొత్తం గ్రామ పంచాయతీలు 12,733లకు గాను 1,12,288 వార్డులకు సంబంధించి అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎన్నికలు జరుగనున్నాయి.

### సర్పంచ్ గిరిపైనే అందరి కన్ను..

ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో ఆశావాహులు రంగంలోకి దిగారు. సమరానికి సన్నాహాలు ప్రారంభించారు. ప్రధానంగా గ్రామాల్లోని యువత ఎన్నికల బరిలోకి దిగాలని ఉవ్విళ్లూరుతున్నారు. అందులోనూ విద్యావంతులే ఎన్నికలపై ఆసక్తి చూపుతుండడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తుండడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. ఆశావాహులు ఇప్పటికే తమ సన్నిహితులు, స్నేహితులతో మంతనాల్లో మునిగిపోయారు. ఎన్నికల్లో ఎలా విజయం సాధించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మరోవైపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ కంటే సర్పంచ్‌గా పోటీ చేయడానికే అందరూ ఆసక్తి చూపిస్తున్నారు. గ్రామంలో ఏ పని జరగాలన్నా సర్పంచే కీలకం కావడంతో ఆ పదవిపైనే అందరూ కన్నేశారు. పార్టీ రహిత ఎన్నికలు కావడంతో పోటీ చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు.

### మొదలైన ప్రచారం..

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆశావహులు అప్పుడే ప్రచారం ప్రారంభించారు. తమ సన్నిహితులు, నమ్మకస్తులను కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. తనకే మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. మరోవైపు, గ్రామంలో సేవా కార్యక్రమాలు సైతం ప్రారంభించారు. ఎవరైనా చనిపోతే లేకపోతే, అనారోగ్యంతో బాధపడుతుంటే వాళ్ల ఇళ్లకు వెళ్లి పరామర్శించడం, ఆర్థికంగా ఎంతో కొంత సహాయం చేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా అక్కడ వాలిపోయి హడావుడి చేస్తున్నారు. ఇక, ఎన్నికల షెడ్యూల్ రావడంతో పల్లెల్లో ఫ్లెక్సీల కోలాహలం కూడా పెరిగింది. ఎక్కడ చూసినా ఆశావాహుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు వెలిశాయి. మొత్తంగా ఏదో విధంగా జనంలో ఉంటూ, వారి దృష్టిని ఆకర్షించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

## కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు..




**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్‌లో మరోసారి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. నగరంలోని కొండాపూర్ సర్వే నెంబర్ 59లో హైడ్రా అధికారులు, సిబ్బంది శనివారం ఉదయం ఆక్రమణలను తొలగించారు. కొండాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో భూమిపై కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. 36 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో తాజాగా హైడ్రా సిబ్బంది భారీ పోలీస్ బందోబస్తు మధ్య నిర్మాణాలను కూల్చివేశారు.

### హైకోర్టు తీర్పుతో..

సుమారు 36 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించారు. గతంలో దీనిపై రంగారెడ్డి కోర్టు.. భూమి ప్రైవేట్ వ్యక్తులదేనని తీర్పు చెప్పింది. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూమి ప్రభుత్వానిదేనని ఇటీవల హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించారు. షెడ్లను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కాగా.. ఈ భూమి విలువ రూ.3,600 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

## 'అందుకే టిమ్స్‌ను నిర్మించడం లేదు'




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** కేసీఆర్‌కు పేరు వస్తుందనే కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం పూర్తి చేయడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్బీనగర్‌లో నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ముందు చూపుతో హైదరాబాద్ నలుదిక్కుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించాలని సంకల్పించారన్నారు. ఎల్బీనగర్, మల్కాజ్‌గిరి, ఎర్రగడ్డలో వేయి పడకలు, నిమ్స్ 2 వేల పడకల ఆస్పత్రి నిర్మించాలని నిర్ణయించారన్నారు. గతంలో ప్రభుత్వాలు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరంలో ఆస్పత్రుల నిర్మాణం చేపట్టలేదని చెప్పారు. పేదల కోసం నాలుగు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలను తమ హయాంలో ప్రారంభించామన్నారు. అవసరమైన నిధులను కూడా కేసీఆర్ సమకూర్చారని చెప్పారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక టిమ్స్ ఆస్పత్రులను పట్టించుకోవడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండి ఉంటే ఏడాది క్రితమే ఆస్పత్రి ప్రారంభించే వాళ్లమన్నారు.

## తొలి టెస్ట్‌లో భారత్ ఘనవిజయం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండిస్ తొలి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. గ్రీవ్స్ (32), హోప్ (26), చేజ్ (24) పరుగులు చేశారు. భారత బౌలర్లలో సిరాజ్ 4 వికెట్లు, బుమ్రా 3, కుల్దీప్ 2, వాషింగ్టన్ సుందర్ 1 వికెట్ తీశారు. అనంతరం భారత బ్యాటర్లు వీర విహారం చేశారు. కేఎల్ రాహుల్ (100), ధ్రువ్ జురేల్ (125) , జడేజా (104 నాటౌట్) సెంచరీలతో రాణించారు. దీంతో 448/5 పరుగుల వద్ద భారత్ డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో సైతం వెస్టిండిస్ బ్యాటర్లు విఫలమయ్యారు. 146 పరుగులకే ఆ జట్టు ఆలౌట్ అయింది. జడేజా 4 వికెట్లు , సిరాజ్ 3, కుల్దీప్ 2, సుందర్ ఒక వికెట్ తీశారు.

## టీమిండియా వన్డే కెప్టెన్‌గా గిల్..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** బీసీసీఐ రోహిత్ శర్మకు షాక్ ఇచ్చింది. ఇప్పటికే టీ20, టెస్ట్ జట్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్‌ను వన్డే జట్టు కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో శుభ్‌మన్ గిల్‌కు బాధ్యతలు అప్పగించింది. త్వరలో ఇండియన్ టీమ్ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఇందులో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. టీ 20 జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ కొనసాగనున్నాడు. అయితే వన్డే కెప్టెన్‌గా మాత్రం రోహిత్ స్థానంలో శుభ్‌మన్‌గిల్‌కు బీసీసీఐ బాధ్యతలు అప్పగించింది. రోహిత్ ఆటగాడిగా మాత్రం జట్టులో కొనసాగనున్నాడు. ఈ నెల 19 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.

### వన్డే జట్టు ఇదే..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్షదీప్, ప్రసిద్ధ్ కృష్ణ, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్).

## నాగ్ అశ్విన్ మూవీలో సాయిపల్లవి!

**కల్కి 2898 AD సినిమాతో ఆడియన్స్‌ను సర్ ప్రైజ్ చేసిన డైరెక్టర్ నాగ్ అశ్విన్ ప్రస్తుతం కల్కి 2 కోసం పని చేస్తున్నాడు. అయితే ప్రీ ప్రొడక్షన్ వర్క్ అంతా పూర్తి చేసినా ప్రభాస్ డేట్స్ దొరకడం లేదు. దీంతో నాగ్ అశ్విన్ కల్కి 2కు బ్రేక్ ఇచ్చి మరో సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సినిమాను సాయి పల్లవితో చేస్తారని ఫిల్మ్ నగర్ సర్కిల్స్ టాక్. తను ఎంచుకున్న పాత్రకు పూర్తిస్థాయి న్యాయం చేస్తుంది సాయి పల్లవి. అలాంటి యాక్ట్రెస్‌తో నాగ్ అశ్విన్ సినిమా అంటే ఆడియన్స్‌లో క్యూరియాసిటీ ఏర్పడింది. నాగ్ అశ్విన్ సినిమా ఓకే అయితే సాయిపల్లవి ఖాతాలో మరో క్రేజీ మూవీ యాడ్ అయినట్టే.**

\- అక్షరటుడే, సినిమాడెస్క్

